# సింగిల్ పేజీ కథలు

## షాక్!

**విశాఖ నుంచి హైదరాబాదు వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ మెల్లగా ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం పైకి వచ్చేస్తోంది. జనంలో కలకలం చెలరేగింది. కదులుతున్న రైలుని పట్టుకుని లోపలికి దూకేస్తున్నారు కొందరు వీరబాబులు.**

సీటు ఖరారైన బోగీల పరిస్థితి ఇలా వుంటే, మామూలు బోగీ గురించి చెప్పేదేముంటుంది? అది రణరంగమే. అందులో దూకి, అందరిని చెండాడి చివరికి మన్మధరావు ఓ సీటు దక్కించుకున్నాడు. తలుపునకు దగ్గరగా, కిటికీ ప్రక్కనే వున్న సీటు చేజిక్కించుకోవటం అంత సులభం కాదు. సినిమాలో హీరోగారు ఎంతసేపు ఫైట్ చేసినా క్రాపు చెరగదు. కానీ, సామాన్య భోగీలో ఫైటింగ్ చేసిన మన్మధరావు క్రాఫింగ్ కాస్తా చెత్తయిపోయింది. క్షణం సేదదీరి, దువ్వెనతో తలదిద్దుకుని తొంగి చూచాడు. అప్పుడే మతిపోయింది అతగాడికి. అలా పోవటానికి కారణం ఓ ఐదడుగుల మూడంగుళాల అద్భుత సౌందర్యం. ఐస్‌లాంటి ఆ స్వీటీ కనిపించగానే ఐసయిపోయాడు మన్మధరావు. తన స్వగ్రామం అనకాపల్లిలో దివిటీ వెలిగించి దేవులాడినా ఇలాంటి స్వీటీ కనిపించదు. అదృష్టంకొద్దీ, ఆ అమ్మాయి ఈ బోగీ దగ్గరికి వచ్చి నుంచున్నది. తలుపునకు అడ్డంగా వేళ్లాడుతున్న కుర్రాళ్ళని గదమాయించి, స్వాగతం పలికాడు ఆమెకి.

అప్పటికే బోగీ నిండిపోయింది. అనకాపల్లి నుంచి ఉదయం కూరగాయల గంపలతో విశాఖ చేరుకున్న నాయుడమ్మలు తిరుగుప్రయాణం చేస్తున్నారు. తలపైన బుట్ట తీయకుండా దారికి అడ్డంగా నుంచున్నారు. పద్మవ్యూహాన్ని ఛేదించి స్వీటీ లోపలికి వెళ్లగలదా? ఆ ఊహరాగానే, హీరోలా మన్మధరావు సీటు ఖాళీ చేసి కంచుకిలా నుంచున్నాడు. మరికాస్త స్వీటుగా నవ్వి స్వీటీ సీటులోకెళ్లిపోయింది. కిటికీలో తల దూర్చేసి దేనికోసమో ఎదురుచూస్తోంది. పాపం! థ్యాంక్స్ చెప్పటానికి తీరికలేని ఆ ఎదురుచూపు ఏమిటో హీరో మన్మధరావుకి అర్థం కాలేదు. స్వీటీ చెయ్యి ఊపింది. మన్మధరావు తలవంచి అటువైపు చూచాడు. ఈ స్వీటీలాంటి మరో బ్యూటీ ఓ ముసలమ్మ చెయ్యి పుచ్చుకుని గబగబ వస్తోంది. ఇద్దరికీ దగ్గరి పోలికలున్నాయి. బోగీ దగ్గరికి రాగానే లోపలి స్వీటీ చటుక్కున దిగిపోయింది. చిటికలో చెరొక చెయ్యి పుచ్చుకుని ముసలమ్మని సీటెక్కించేశారు. జరిగిందేమిటో మన్మధరావుకి తెలిసేసరికి 'బయలుదేరుచున్నది' అన్న మాటలు మైకులో మోగటమూ, బండి కదలటమూ ఒకేసారి జరిగాయి.

"మామ్మా, జాగర్త" అన్నారు ముద్దుల మనుమరాళ్లు.



"పెందరాళే ఇంటికి వెళ్లండర్రా" పరాకు చెప్పంది మామ్మ. ఇద్దరి చెంపలు అద్దుకుని ముద్దులు పెట్టేసింది. ఎవరిగోల వారిదే. కనుచూపుమేర దాటేసి కదిలిపోయింది గోదారి. సీటు త్యాగం చేసి స్వీటీల టాటాలకి అవకాశం కల్పించిన మన్మధరావు మరుగున పడిపోయాడు. అమ్మాయిల అమ్మమ్మల చదరంగంలో పావుగా మారిపోయాడు. ముద్దు ముచ్చట మాట దేవుడెరుగు. కనీసం మూడో చిరునవ్వుకైనా నోచుకోలేదు. ప్రక్కసీటులో కుర్రాడు స్వీటు కావాలని మారం చేస్తున్నాడు. ఒకటి చాలదట. రెండివ్వాలని మొండిగా ఏడుస్తున్నాడు. విసిగిపోయి వాడి అమ్మ రెండింటితోపాటు మరో రెండు వాయించేసింది. కుర్రాడు తింటున్నాడు. ఏడుస్తున్నాడు. ఏడుస్తూనే తినేస్తున్నాడు. కాని, సీటు-స్వీటూ రెండూ పోగొట్టుకున్న మన్మధరావు అటు ఏడవనూ లేదు; ఇటు నవ్వుకోనూ లేదు. మన్మధరావుకి నిజంగానే మతిపోయేలా వుంది. తన్ను కన్నతల్లి అనకాపల్లి అసలైన పేరు 'అనేకఫలి'. ఎన్నో రకాల ఫల సంపత్తి వున్న ఊరు. అక్కడే తనకో స్వీటీ కరువవుతుందా? దివిటీ వెలిగించాలి. దేవులాడాలి. అనకాపల్లి స్టేషన్‌కి దగ్గరపడుతున్నకొద్దీ, పోయినమతి మెల్లగా తిరిగి వస్తున్నట్లు అనిపిస్తోంది మన్మధరావుకి. దూకటానికి సిద్ధమయ్యాడు.

**-వి.రాఘవేంద్రరావు (హైదరాబాద్)**

## అర్థం

**"ఇదేమిటి పిన్నీ..అసలు ఇది మీ ఇల్లేనా?" సెలవులు హాయిగా పిన్నిగారింట్లో గడుపుదామని ఢిల్లీనుంచి వచ్చిన రాధ, రవి ఇద్దరూ ఒకేసారి అడిగారు.**

"అదేమిట్రా అలా అంటున్నారు.." వారికి మంచినీళ్ళు అందిస్తూ అడిగింది పిన్ని.

"ఘోరం..మహాఘోరం..చుట్టూ చక్కని పూలమొక్కలతో, మంచి పండ్లచెట్లతో పూలతోటలాగా కళకళలాడే మీ ఇల్లు, ఇలా రోగిష్టి శరీరంలా, ఎండిపోయిన నదిలా, బీటలువారిన భూమిలా ఇంత భయంకరంగా తయారయిందేమిటి పిన్నీ?" గడ గడా మంచినీళ్ళు త్రాగేసి గబ గబా అన్నాడు రవి.

"ఒరేయ్..మరీ అంత అన్యాయంగా మాట్లాడకురా, ఏదో నాలుగు అద్దె డబ్బులు వస్తాయని చెట్లన్నీ కొట్టించి పోర్షన్లు కట్టించాను. అంత మాత్రాన..."

"వాడన్నది నిజమే పిన్నీ..కాంక్రీట్ అరణ్యాల మీద విరక్తి కలిగి, ఈ సెలవులు నెలరోజులూ మీ వనవాటికలో హాయిగా, ప్రశాంతంగా కాలుష్యం లేని కమ్మని గాలి పీలుస్తూ, ప్రశాంతంగా బ్రతకాలని వచ్చాం. కానీ, ఇప్పుడు మీ ఇల్లు..జీవంలేని అందమైన రబ్బరు బొమ్మలా, కళావిహీనమయిన నవ్వులా ఉంది.." అన్నది రాధ సూట్‌కేస్ లోపలకు తీసుకెళ్తూ.

"ఓరి..మీ కవిత్వం కూడా..ఒకరిని మించి ఒకరయ్యారు. ఉండండి, కాఫీ తెస్తాను. స్నానాలు చేసి భోజనం చేద్దురు.." అన్నది పిన్ని వంటగదిలోకి వెళ్తూ.

'పిన్ని ఒక్కత్తి. పిల్లా పీచూ లేరు. ఆస్తి బోలెడు